జ్వాల
దశ
నిజం.. నిర్భయంగా..

WWW.DASHANEWS.COM
గురువారం
16-07-2026
సంపుటి 1 సంచిక 233
పేజీలు : 04
వెల : 1/-
PRGI No : TGTEL/25/A4195

యువ సంగ్రామ సదస్సును విజయవంతం చేయాలి

మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి

4లో

బోనాల సందర్భంగా 16 నుంచి చేతివృత్తి కళాకారుల వస్తు ప్రదర్శన

4లో

నెలలోనే 50 నామినేటెడ్

పదవులు భర్తీ: మహేశ్ గౌడ్

దశ,హైదరాబాద్: రాష్ట్రంలో 50 నామినేటెడ్ పదవులను ఈ నెలలోనే భర్తీ చేస్తామని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ప్రకటించారు. ప్రస్తుతం మంచి పనితీరు కనబరిచిన వారిని రెన్యువల్ చేసే అవకాశం ఉందన్నారు. డీసీసీల పనితీరు బాగోలేకపోతే మార్చే అవకాశం ఉందని వెల్లడించారు. పార్టీ పదవులపై మీనాక్షి నటరాజన్‌తో చర్చించామని తెలిపారు. రెండు రోజుల్లో సీఎం రేవంత్ రెడ్డితో భేటీ అవుతామన్నారు. మండల కమిటీలలో డీసీసీల రిపోర్ట్ ఫైనల్ అని స్పష్టం చేశారు. ఎంపీ రేణుకా చౌదరితో కూడా మాట్లాడానని మహేశ్ తెలిపారు. ఖమ్మంలో బీజేపీ, బీఆర్ఎస్ రెండూ కూడా కాంగ్రెస్ వైపు చూస్తున్నట్టుగా రేణుక తనతో చెప్పారని అన్నారు. కానీ ఆ వ్యాఖ్యలపై దుష్ప్రచారం చేశారు అని తెలిపారు. కూనంనేనితో తమకెలాంటి విభేదాలూ లేవన్నారు. స్థానికంగా ఉన్న సమస్యలను స్థానికంగానే పరిష్కరించుకోవాలని చెప్పారు.

తెలంగాణలో 'సర్' గడువు పొడిగింపు..

4లో

అక్టోబర్ 12న తుది ఓటరు జాబితా



ప్రపంచంలోనే అత్యుత్తమ పెట్టుబడుల

గమ్యస్థానంగా తెలంగాణ

భారత్ ఫ్యూచర్ సిటీలో అమెజాన్ AWS డేటా సెంటర్‌కు సీఎం శంకుస్థాపన

- 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యం
- ఫ్యూచర్ సిటీని ప్రపంచ స్థాయి, కాలుష్యరహిత, అత్యాధునిక నగరంగా అభివృద్ధి చేస్తామన్న సీఎం
- AWS డేటా సెంటర్‌తో ఐటీ, డేటా సెంటర్ ఎకోసిస్టమ్‌కు మరింత ఊతం
- హైదరాబాద్‌ను కాలుష్యరహిత నగరంగా తీర్చిదిద్దేందుకు ఈవీ విధానాలకు ప్రాధాన్యం
- రంగారెడ్డి జిల్లా రైతులకు న్యాయమైన నష్టపరిహారం అందిస్తామని సీఎం హామీ
- పరిశ్రమలకు ప్రభుత్వం నియంత్రణ సంస్థగా కాదు.. సహాయకుడిగా పనిచేస్తుందని శ్రీధర్ బాబు వెల్లడి

హైదరాబాద్, ప్రతినిధి: తెలంగాణను ప్రపంచ స్థాయి పెట్టుబడుల కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా మరో కీలక అడుగు పడింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అభివృద్ధి చేస్తున్న 'భారత్ ఫ్యూచర్ సిటీ'*లో అమెజాన్ వెబ్ సర్వీసెస్ (AWS) ఆధ్వర్యంలో ఏర్పాటు కానున్న భారీ డేటా సెంటర్‌కు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ డేటా సెంటర్ భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి తొలి మైలురాయిగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఉన్నతాధికారులు, అమెజాన్ ప్రతినిధులతో కలిసి భూమిపూజ నిర్వహించిన అనంతరం జరిగిన సభలో ముఖ్యమంత్రి రాష్ట్ర భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలను వివరించారు. తెలంగాణను ప్రపంచ పెట్టుబడుల గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణతో ముందుకు సాగుతోందని తెలిపారు.

రూ. లక్ష కోట్ల పెట్టుబడులకు పిలుపు

వచ్చే 14 ఏళ్లలో తెలంగాణలో 7 బిలియన్ డాలర్ల (సుమారు రూ.58 వేల కోట్లు) పెట్టుబడులు పెట్టేందుకు అమెజాన్ సిద్ధంగా ఉందని సీఎం వెల్లడించారు. అయితే రాష్ట్రం నిర్దేశించుకున్న 2034 అభివృద్ధి లక్ష్యాలను దృష్టిలో ఉంచుకుని అమెజాన్ తన పెట్టుబడులను రూ.1 లక్ష కోట్లకు పెంచాలని కోరారు. ఇందుకు అవసరమైన అన్ని అనుమతులు, మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తుందని, పెట్టుబడుల పురోగతిని ప్రతి నెలా తానే స్వయంగా సమీక్షిస్తానని స్పష్టం చేశారు. భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్మాణం ప్రారంభమవుతున్న ఈ డేటా సెంటర్ దేశంలోనే అతిపెద్ద వాటిలో ఒకటిగా నిలవడంతో పాటు, భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ సంస్థలను తెలంగాణకు ఆకర్షించే కేంద్రంగా

..మిగతా 4వ పేజీలో ➔

టెట్ ఫలితాల షాక్

- సగం మంది కూడా అర్హత సాధించలేదు
- 14,814 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు ఫెయిల్..
- 2028 నాటికి టెట్ పాస్ కాకపోతే ఉద్యోగాలపై ముప్పు



దశ, హైదరాబాద్: తెలంగాణ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ఫలితాలు రాష్ట్ర విద్యారంగంలో తీవ్ర చర్చకు దారితీశాయి. ఈసారి పరీక్షకు హాజరైన అభ్యర్థుల్లో కేవలం 43.94 శాతం మంది మాత్రమే అర్హత సాధించగా, సగానికి పైగా అభ్యర్థులు విఫలమయ్యారు. ముఖ్యంగా ప్రస్తుతం విధుల్లో ఉన్న ప్రభుత్వ ఉపాధ్యాయుల ఫలితాలు విద్యాశాఖను ఆందోళనకు గురిచేశాయి. 23,623 మంది ఇన్‌సర్వీస్ టీచర్లు పరీక్ష రాయగా, కేవలం 8,809 మంది (37.29 శాతం) మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. ఏకంగా 14,814 మంది ఫెయిల్ కావడంతో వారి ఉద్యోగ భద్రతపై చర్చ మొదలైంది. హైదరాబాద్‌లోని పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్‌లో పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్, టెట్ కన్వీనర్ జి. రమేశ్, టెట్ డైరెక్టర్ రేవతిరెడ్డి కలిసి ఫలితాలను విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 1,15,028 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకాగా, 50,544 మంది మాత్రమే అర్హత సాధించారు.

పేపర్1లో మెరుగైన ఫలితాలు.. పేపర్2లో నిరాశ

సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్‌జీటీ) పోస్టులకు సంబంధించిన పేపర్ 1 పరీక్షలో 36,129 మంది హాజరుకాగా, 23,590 మంది (65.29 శాతం) ఉత్తీర్ణులయ్యారు. అయితే స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు నిర్వహించిన పేపర్ 2లో ఫలితాలు నిరాశపరిచాయి. మొత్తం 78,899 మంది పరీక్ష రాయగా, 26,954 మంది (34.16 శాతం) మాత్రమే అర్హత సాధించారు. పేపర్ 2లో మ్యాథ్స్ అండ్ సైన్స్ విభాగంలో 17,987 మంది (40.76 శాతం) ఉత్తీర్ణులు

..మిగతా 4వ పేజీలో ➔

ఈ-20 పెట్రోల్‌పై వాహనదారుల ఆందోళన

దశ, ముంబై : పర్యావరణ పరిరక్షణ, ముడిచమురు దిగుమతుల తగ్గింపు లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ20 (20% ఇథనాల్ మిశ్రమం) పెట్రోల్ విధానంపై దేశవ్యాప్తంగా వాహనదారుల నుంచి ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. తగిన అవగాహన లేకుండానే ఈ విధానాన్ని అమలు చేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. పాత బీఎస్4, బీఎస్6 వాహనాల్లో ఈ20 వినియోగం వల్ల ఫ్యూయల్ లైన్లు, రబ్బర్ ట్యూబులు, ఇంజిన్ భాగాలు దెబ్బతినే అవకాశం ఉందని కొందరు మెకానిక్ నిపుణులు అభిప్రాయపడుతుండగా, మైలేజీ కూడా 5-10 శాతం వరకు తగ్గుతోందని పలువురు వాహనదారులు చెబుతున్నారు. మరోవైపు, సోషల్ మీడియాలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీపై పలు ఆరోపణలు, ప్రచారాలు జరుగుతున్నప్పటికీ వాటికి అధికారిక ఆధారాలు లేవు. వాహనదారులకు సాధారణ పెట్రోల్ లేదా ఈ10 వంటి ప్రత్యామ్నాయాలు కూడా అందుబాటులో ఉంచాలని, ఈ20 వల్ల వాహనాలపై ప్రభావం లేదని శాస్త్రీయ ఆధారాలతో కేంద్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి.

నకిలీ నంబర్ ప్లేట్లపై హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసుల ఉక్కుపాదం

దశ, హైదరాబాద్: నకిలీ వాహన నంబర్ ప్లేట్లు ఉపయోగిస్తున్న వారిపై హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. గత వారం రోజుల్లో జూబ్లీహిల్స్, మలక్‌పేట్, బేగంబజార్, అబిడ్స్, కాచిగూడ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఐదు క్రిమినల్ కేసులు నమోదు చేసి పలు వాహనాలను సీజ్ చేశారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై 'జీరో టాలరెన్స్' విధానంలో చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. వాహనాలపై తప్పనిసరిగా HSRP (హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్) ఉండాలని, నగరవ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు కొనసాగుతాయని తెలిపారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

కల్తీ ఐస్‌క్రీమ్ కేంద్రంపై ఎస్‌వోటీ దాడి

రామంతాపూర్‌లో ఘటన

దశ, హైదరాబాద్ : నగరంలోని రామంతాపూర్ లక్ష్మీనారాయణ కాలనీలో గుట్టుచప్పుడు కాకుండా నడుస్తున్న కల్తీ ఐస్‌క్రీమ్ తయారీ కేంద్రంపై ఎస్‌వోటీ పోలీసులు మెరుపు దాడి నిర్వహించారు. తనిఖీల్లో గడువు ముగిసిన ఫుడ్ కలర్స్, వివిధ ఫ్లేవర్లు, ఫంగస్ పట్టిన ఎండు అంజీర్‌తో ఐస్‌క్రీమ్‌లు తయారు చేస్తున్నట్లు గుర్తించారు. దాడిలో లేబుళ్లు లేని ముడి పదార్థాలు, భారీ మొత్తంలో లూజ్ టూటీ ఫ్రూటీని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేంద్రం నుంచి స్థానిక దుకాణాలకు కల్తీ ఐస్‌క్రీమ్‌లు సరఫరా చేస్తున్నట్లు విచారణలో తేలింది. యూనిట్ నిర్వాహకుడు మందుల రమేష్ను అదుపులోకి తీసుకున్న పోలీసులు, కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

ప్రపంచంలోనే అత్యుత్తమ పెట్టుబడుల

గమ్యస్థానంగా తెలంగాణ

మొదటి పేజీ తరువాయి

మారుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

'తెలంగాణ రైజింగ్-2047'కు శ్రీకారం

ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ISB) భాగస్వామ్యంతో రూపొందించిన 'తెలంగాణ రైజింగ్-2047' విజన్డా క్యుమెంట్ రాష్ట్ర అభివృద్ధికి మార్గదర్శకంగా ఉంటుందని సీఎం తెలిపారు. ఈ విజన్ ప్రకారం 2034 నాటికి తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. దేశ జనాభాలో కేవలం 2.5 శాతం ఉన్న తెలంగాణ ప్రస్తుతం దేశ జీడీపీలో 5 శాతం వాటా కలిగి ఉందని, దానిని 2047 నాటికి 10 శాతానికి పెంచేందుకు ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ అమలు చేస్తోందన్నారు.

మూడు జోన్లుగా అభివృద్ధి ప్రణాళిక

హైదరాబాద్ భవిష్యత్తులో ట్రాఫిక్, కాలుష్య సమస్యలను ఎదుర్కోకుండా రాష్ట్రాన్ని మూడు అభివృద్ధి మండలాలుగా విభజించి ప్రణాళికలు అమలు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి వివరించారు. కోర్ అర్బన్ ఏరియా (ORR లోపల): కాలుష్యరహిత హైదరాబాద్ లక్ష్యంగా నగరంలోని పరిశ్రమలను బయటకు తరలించడం, మూసీ నది పునరుజ్జీవనం, ఎలక్ట్రిక్ వాహనాలకు జీరో టాక్స్, 3,000 డీజిల్ ఆర్టీసీ బస్సుల స్థానంలో ఈవీ బస్సులు, రెండు లక్షల ఆటోలను రెట్రోఫిట్ చేయడం వంటి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. పెరి అర్బన్ ఏరియా (ORR-RRR మధ్య): ఈ ప్రాంతాన్ని తయారీ పరిశ్రమల కేంద్రంగా అభివృద్ధి చేసి, చైనాతో పోటీపడే స్థాయిలో పరిశ్రమలకు విద్యుత్, నీరు, నైపుణ్యం కలిగిన మానవ వనరులను అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. రూరల్ అగ్రికల్చర్ జోన్ (RRR వెలుపల): వ్యవసాయ ఆధారిత గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు.

రైతుల త్యాగం మరువలేం

భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణం కోసం భూములు ఇచ్చిన రైతుల సేవలను ప్రభుత్వం ఎప్పటికీ మరువదని ముఖ్యమంత్రి అన్నారు. భూములు కోల్పోయిన రైతులకు మరింత మెరుగైన నష్టపరిహారం అందజేసి, వారి విశ్వాసాన్ని నిలబెట్టేలా ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరిస్తుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ప్రభుత్వ సలహాదారు కె. రామకృష్ణారావు, అమెజాన్ ఉన్నతాధికారులు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుపై త్వరలో శుభవార్త

సీఎం రేవంత్ రెడ్డి

దశ, మహబూబ్‌నగర్: పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు 90 టీఎంసీల నీటి వినియోగ అనుమతుల కోసం కేంద్రం, ఆంధ్రప్రదేశ్‌తో చర్చలు జరుగుతున్నాయని, త్వరలో శుభవార్త వినిపిస్తామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా దివిటిపల్లిలో అమర రాజా గిగా కారిడార్‌లో ఏర్పాటు చేసిన కస్టమర్ క్వాలిఫికేషన్ ప్లాంట్ (CQP)ను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. డిండి ప్రాజెక్టుకు 30 టీఎంసీల నీటి కేటాయింపులపై కూడా చర్చలు కొనసాగుతున్నాయని, పాలమూరు జిల్లాను అభివృద్ధి చెందిన జిల్లాగా తీర్చిదిద్దుతామని చెప్పారు. అమర రాజా సంస్థ స్థానిక యువతకు ఎక్కువ ఉద్యోగాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, అమర రాజా గ్రూప్ చైర్మన్ గల్లా జయదేవ్, ఎంపీ డీకే అరుణ, ప్రభుత్వ విప్ యన్నం శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తదితరులు పాల్గొన్నారు.

యువ సంగ్రామ సదస్సును విజయవంతం చేయాలి

మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి

దశ, ఇబ్రహీంపట్నం: ఈ నెల 18వ తేదీన సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అధ్యక్షతన నిర్వహించనున్న *"యువ సంగ్రామ సదస్సు"*ను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి (బంటి) పిలుపునిచ్చారు. సదస్సు విజయవంతానికి సంబంధించి ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కేంద్రంలో యువజన, విద్యార్థి నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా యువ సంగ్రామ సదస్సు ఏర్పాట్లు, యువత భాగస్వామ్యం, కార్యాచరణపై నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా బంటి మాట్లాడుతూ, యూత్ డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేసిందని ఆరోపించారు. ఆ విషయాలను ప్రతి యువకుడికి వివరించి, నియోజకవర్గం నలుమూలల నుంచి అధిక సంఖ్యలో యువతను యువ సంగ్రామ సదస్సుకు హాజరయ్యేలా కృషి చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ఈ సమావేశంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ యువజన, విద్యార్థి విభాగం నాయకులు, యువ నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలంగాణలో 'సర్' గడువు పొడిగింపు

అక్టోబర్ 12న తుది ఓటరు జాబితా

దశ, హైదరాబాద్: తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) ప్రక్రియ గడువును కేంద్ర ఎన్నికల సంఘం (CEC) పొడిగించింది. సవరించిన షెడ్యూల్ ప్రకారం బీఎల్‌వోల ఇంటింటి సర్వే ఆగస్టు 3 వరకు, డ్రాఫ్ట్ ఓటరు జాబితా ఆగస్టు 10న, క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ సెప్టెంబర్ 9 వరకు, వాటి పరిష్కారం అక్టోబర్ 8 వరకు కొనసాగనుంది. తుది ఓటరు జాబితా అక్టోబర్ 12న ప్రచురించనున్నారు. తెలంగాణ ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు గడువును పొడిగించినట్లు కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. సవరించిన షెడ్యూల్‌ను అధికారులు, రాజకీయ పార్టీలకు వెంటనే తెలియజేయాలని సీఈసీ ఆదేశాలు జారీ చేసింది.

టెట్ ఫలితాల షాక్

మొదటి పేజీ తరువాయి

కాగా, సోషల్ స్టడీస్ విభాగంలో కేవలం 8,967 మంది (25.79 శాతం) మాత్రమే టెట్‌లో అర్హత సాధించడం గమనార్హం.

ప్రభుత్వ టీచర్ల ఫలితాలు ఆందోళనకరం

ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల ఫలితాలు విద్యాశాఖను కలవరపరిచాయి. 23,623 మంది ఇన్‌సర్వీస్ టీచర్లు టెట్ పరీక్ష రాయగా, 8,809 మంది మాత్రమే పాస్ అయ్యారు. అంటే 14,814 మంది (62.71 శాతం) ఫెయిల్ అయ్యారు. గత ఏడాది ప్రభుత్వ ఉపాధ్యాయుల ఉత్తీర్ణత 50 శాతం ఉండగా, ఈసారి అది 37.29 శాతానికి పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఇన్‌సర్వీస్ టీచర్లలో పేపర్1లో 52.57 శాతం, పేపర్2 మ్యాథ్స్ అండ్ సైన్స్‌లో 38.27 శాతం, సోషల్ స్టడీస్‌లో కేవలం 24.05 శాతం మాత్రమే ఉత్తీర్ణత సాధించారు.

2028 వరకు గడువు.. లేదంటే ఉద్యోగాలకు ప్రమాదం

సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం, ప్రస్తుతం విధుల్లో ఉన్న ప్రభుత్వ ఉపాధ్యాయులు 2028 ఆగస్టు నాటికి తప్పనిసరిగా టెట్ అర్హత సాధించాలి. ఆ గడువులోగా టెట్ పాస్ కాకపోతే ఉద్యోగాలను కోల్పోయే అవకాశం ఉంది. తాజా ఫలితాల్లో 14 వేల మందికి పైగా ప్రభుత్వ టీచర్లు విఫలమవడంతో వారి భవిష్యత్‌పై ఆందోళన వ్యక్తమవుతోంది. తాజా టెట్ ఫలితాలు రాష్ట్రంలో ఉపాధ్యాయుల శిక్షణ, బోధనా నైపుణ్యాలు, పరీక్షా విధానంపై మరోసారి చర్చకు తెరలేపాయి. ప్రభుత్వం, విద్యాశాఖ ఈ ఫలితాలను విశ్లేషించి ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

జాతీయ స్థాయిలో మెరిసిన ఎస్ఎన్ఐఎస్‌టీ 'టెక్‌నిధి-2026'

దశ ఓయూ: శ్రీనిధి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఎస్ఎన్ఐఎస్‌టీ) ఆధ్వర్యంలో తొలిసారిగా నిర్వహించిన జాతీయ స్థాయి సాంకేతిక ఉత్సవం టెక్‌నిధి2026' విజయవంతంగా ముగిసింది. జూలై 9 నుంచి 11 వరకు మూడు రోజుల పాటు నిర్వహించిన ఈ వేడుకలో దేశవ్యాప్తంగా ఉన్న 75కు పైగా విద్యాసంస్థల నుంచి 940 మందికి పైగా విద్యార్థులు, 400కు పైగా బృందాలుగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. విజేతలకు మొత్తం రూ.7 లక్షల నగదు బహుమతులను అందజేశారు. ఈ ఉత్సవంలో డిజిటల్ ఇండువా, హ్యాక్ ది మ్యాట్రిక్స్, సైబర్ స్ట్రైక్, కోడ్ కురుక్షేత్ర, ట్రైటెక్ అనే ఐదు ప్రధాన సాంకేతిక విభాగాల్లో పోటీలు నిర్వహించారు. అదనంగా బూట్‌క్యాంప్‌లు, వర్క్‌షాప్‌లు, సాంకేతిక చర్చలు, 24 గంటల హ్యాకథాన్‌లు నిర్వహించి విద్యార్థుల్లో సృజనాత్మకత, సాంకేతిక నైపుణ్యాలు, సమస్య పరిష్కార సామర్థ్యాలను పెంపొందించేలా కార్యక్రమాలు చేపట్టారు. ప్రారంభోత్సవానికి సేల్స్‌ఫోర్స్ సంస్థ సీనియర్ మేనేజర్ (డెలివరీ ఇన్నోవేషన్) విజయ్ మహంతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం జరిగిన ప్యానెల్ చర్చలో మైక్రోసాఫ్ట్, నోకియా, గ్రౌండ్ గేమ్ హెల్త్, బీయింగ్ జీరో, గ్రాడ్‌స్కూల్స్, టెక్‌స్నాప్ సంస్థల ప్రతినిధులు పాల్గొని విద్యార్థులతో తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ చర్చకు ప్లానాన్ సంస్థలో పనిచేస్తున్న ఎస్ఎన్ఐఎస్‌టీ పూర్వ విద్యార్థి శివ రామకృష్ణ సమన్వయకర్తగా వ్యవహరించారు. ముగింపు కార్యక్రమానికి క్యాప్‌జెమినీ సీనియర్ మేనేజర్ అంకుర్ మిత్తల్ ముఖ్య అతిథిగా హాజరుకాగా, ANAROCK సంస్థ హెచ్ఆర్ & టాలెంట్ అక్విజిషన్ మేనేజర్ హరి పవన్ శ్రిపాధ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్, GRADSTREET వ్యవస్థాపకుడు & సీఈఓ దుర్గ నవీన్ కంద్రేగుల గౌరవ అతిథులుగా పాల్గొన్నారు. డీన్ డా. అరుణ వరణాసి, గ్రూప్ డైరెక్టర్ సీడీసీ యల్లపు వాసుదేవరావు, అసోసియేట్ డీన్ డా. మను గుప్తా మార్గదర్శకత్వంలో ఎస్ఎన్ఐఎస్‌టీ యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థుల సమిష్టి కృషితో ఈ మహోత్సవం విజయవంతమైంది. జాతీయ స్థాయిలో నిర్వహించిన ఈ కార్యక్రమం విద్యార్థులకు తమ సాంకేతిక ప్రతిభను ప్రదర్శించేందుకు, పరిశ్రమ నిపుణులతో ప్రత్యక్షంగా మమేకం కావడానికి, వినూత్న ఆలోచనలకు రూపం ఇవ్వడానికి సమర్థవంతమైన వేదికగా నిలిచింది. భవిష్యత్తులో టెక్‌నిధి దేశంలోని ప్రముఖ విద్యార్థి సాంకేతిక ఉత్సవాల్లో ఒకటిగా ఎదగనుందని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

బోనాల సందర్భంగా 16 నుంచి చేతివృత్తి కళాకారుల వస్తు ప్రదర్శన

దశ, హైదరాబాద్: ఆషాఢ బోనాల మహోత్సవాల సందర్భంగా ఈ నెల 16 నుంచి హైదరాబాద్‌లోని హెచ్ఎండీఏ గ్రౌండ్‌లో రాష్ట్రస్థాయి చేతివృత్తి కళాకారుల వస్తు ప్రదర్శనఅమ్మకాల మేళా నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్ బాల మాయాదేవి తెలిపారు. బోనాల పండుగకు అవసరమైన చేతివృత్తుల ఉత్పత్తులన్నీ ఒకే వేదికపై అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. గత ఏడాది 30 స్టాల్స్ ఏర్పాటు చేయగా, ఈసారి 60 స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర మంత్రులు భట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, వాకిటి శ్రీహరి, బీసీ సంక్షేమ శాఖ సలహాదారు వి.హెచ్. హనుమంతరావుతో పాటు ఎంపీలు, ఎమ్మెల్యేలు ప్రారంభోత్సవంలో పాల్గొంటారని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా కుమ్మరి, కమ్మరి, వడ్రంగి, మేదరి, చేనేత, పూసల తదితర సంప్రదాయ చేతివృత్తుల కళాకారులు తమ ఉత్పత్తులను నేరుగా విక్రయించే అవకాశం ఈ మేళా ద్వారా కల్పిస్తున్నట్లు తెలిపారు.

స్విగ్గీ ఇన్‌స్టామార్ట్‌లో 10 నిమిషాల్లో గ్యాస్ సిలిండర్ సేవ

దశ, న్యూఢిల్లీ: దేశంలో తొలిసారిగా హెచ్‌పీసీఎల్ (HPCL) సంస్థ, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్‌తో కలిసి క్విక్ కామర్స్ ద్వారా 10 నిమిషాల్లో ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ల డెలివరీ సేవలను బెంగళూరులో ప్రారంభించనుంది. అయితే సిలిండర్లను సాధారణ గ్యాస్ ఏజెన్సీల సిబ్బందే భద్రతా నిబంధనలతో వినియోగదారులకు అందజేయనున్నారు. మొదటిసారి కనెక్షన్ తీసుకునే వారు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు సమర్పించాల్సి ఉండగా, అనంతర బుకింగ్‌లను రీఫిల్‌గా పరిగణిస్తారు. రీఫిల్ సమయంలో ఖాళీ సిలిండర్‌ను తప్పనిసరిగా తిరిగి ఇవ్వాల్సి ఉంటుంది. ఎల్‌పీజీ సేవలను మరింత వేగంగా ప్రజలకు అందించడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని హెచ్‌పీసీఎల్ మార్కెటింగ్ డైరెక్టర్ అమిత్ గర్గ్ తెలిపారు. ఇతర నగరాలకు ఈ సేవలను ఎప్పుడు విస్తరిస్తారన్న విషయాన్ని సంస్థ ఇంకా ప్రకటించలేదు.

సమాచార భవన్ సాక్షిగా జర్నలిస్టుల గర్జన..

సమస్యల పరిష్కారానికి టీడబ్ల్యూజేఎఫ్ మహాధర్నా..

రేవంత్ రెడ్డి సర్కారు చొరవ చూపాలి

ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులపై నిర్ణయం తీసుకోవాలి

అక్రిడిటేషన్ల జారీలో 'అకాడమీ' వివక్ష పై నిప్పులు

మసాబ్ ట్యాంక్ రోడ్లను ముంచెత్తిన జర్నలిస్టు లోకం..

దశ ఓయూ: రాష్ట్రంలో జర్నలిస్టుల దశాబ్దాల నిరీక్షణకు తెరదించాలని, పెండింగ్‌లో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) పోరుబాట పట్టింది. బుధవారం హైదరాబాద్‌లోని మసాబ్ ట్యాంక్ వద్ద ఉన్న సమాచార భవన్ (కమిషనరేట్) ఎదుట నిర్వహించిన 'మహాధర్నా' ఉవ్వెత్తున ఎగసింది. రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన వందలాది మంది జర్నలిస్టులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం గొంతెత్తారు. నినాదాలతో మసాబ్ ట్యాంక్ పరిసరాలు హోరెత్తాయి. ధర్నాను ఉద్దేశించి ఫెడరేషన్ రాష్ట్ర యాక్టింగ్ ప్రెసిడెంట్ పి. రాంచందర్, ప్రధాన కార్యదర్శి బి. బసవపున్నయ్య ప్రసంగిస్తూ.. జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం జాప్యం చేయడం తగదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా స్పందించి, పాత్రికేయుల సమస్యలను మానవతా దృక్పథంతో పరిష్కరించాలని కోరారు. 'ఫ్యూచర్ సిటీ'లో ఇళ్ల స్థలాల కేటాయింపు ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని, క్యాబినెట్ సబ్ కమిటీకి స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అక్రిడిటేషన్ కార్డుల జారీలో కొందరికి అనుకూలంగా వ్యవహరిస్తూ, అర్హులైన జర్నలిస్టులకు కార్డులు నిరాకరించడం దారుణమని ధ్వజమెత్తారు. యూనియన్ల పేరిట విభజన రాజకీయాలు చేయడం మానుకోవాలని, పారదర్శకత లేని అక్రిడిటేషన్ కమిటీలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జర్నలిస్టులకు నగదు రహిత ఆరోగ్య సదుపాయం కల్పించాలనీ, ఆర్టీసీ బస్సులతో పాటు మెట్రో రైలులోనూ ఉచిత ప్రయాణ పాసులు జారీ చేయాలనీ, నిలిపివేసిన రైల్వే రాయితీలను పునరుద్ధరించాలని కోరుతూ కేంద్రానికి సీఎం లేఖ రాయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో డీజేఎఫ్‌టీ ప్రధాన కార్యదర్శి మస్తాన్ పాల్గొని మద్దతు ప్రకటించారు. ఫెడరేషన్ ఉపాధ్యక్షులు ఎల్గొయి ప్రభాకర్, తాటికొండ కృష్ణ, బి. రాజశేఖర్, కార్యదర్శులు గండ్ర నవీన్, ఇ. చంద్రశేఖర్, సలీమా, గుడిగ రఘు, మాణిక్ ప్రభు, నిరంజన్, వెంకటేష్, దామోదర్, హెచ్‌యూజే అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అరుణ్ కుమార్, జగదీశ్ తమ గళాన్ని వినిపించారు. ఖమ్మం అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ ఖదీర్, శ్రీనివాస రెడ్డి, ఎం జీవన్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు శేరిబాయి గణేష్, మేడ్చల్ ప్రతినిధులు మల్లేష్ గౌడ్, రవి నాయక్, హరి ప్రసాద్, సూర్యాపేట నుంచి ఐ. రాంబాబు, బి. రాంబాబు, నాగర్ కర్నూల్ ప్రతినిధులు వెంకటస్వామి, రాంచందర్, వనపర్తి అధ్యక్షుడు రాము, జ్ఞానేశ్వర్, జోగులాంబ గద్వాల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు జాన్, రంగముని, మహిళా ప్రతినిధులు శశికళ, విజయ, మణిమాల, రాణి, అలాగే నేతలు రేనయ్య, భాస్కర్, జేఎస్ జే నాయకులు అశోక్ రెడ్డి పాల్గొని జర్నలిస్టుల ఐక్యతను చాటారు.

ఆర్మీ డిగ్రీ కళాశాలలో

అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

©దశ, భూదాన్ పోచంపల్లి: భూదాన్ పోచంపల్లి మండలం దేశ్‌ముఖి గ్రామంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ఆర్మీ డిగ్రీ మహిళా కళాశాలలో 202627 విద్యా సంవత్సరానికి ఖాళీ సీట్ల భర్తీ కోసం ఈ నెల 18న స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ *శ్రీలత* తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కోటాల్లో బీఎస్సీ, బీకాం కోర్సుల్లో ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. అభ్యర్థులు ఈ నెల 18న ఉదయం 9 గంటలలోపు విద్యార్హత, కుల, ఆదాయ, ఆధార్ తదితర ధ్రువీకరణ పత్రాలు, రెండు ఫొటోలు, రన్నింగ్ షూస్‌తో హాజరుకావాలని సూచించారు. స్క్రీనింగ్ పరీక్షలో అర్హత సాధించిన వారికి ఖాళీ సీట్ల లభ్యత ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తామని వెల్లడించారు.

జూపల్లి సహకారంతో మహమ్మదాపూర్ లో

అభివృద్ధి పరుగులు

ధన్యవాదాలు తెలిపిన మాజీ సర్పంచ్ జయరాములు సాగర్

మంత్రి జూపల్లి కృష్ణారావు గారి సహకారంతో మహమ్మదాపూర్ గ్రామంలో చేపట్టబడిన అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు.

సీసీ రోడ్లు - ₹20 లక్షలు

అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ - ₹20 లక్షలు

వీరన్న చెరువు నుండి పైప్‌లైన్ ఏర్పాటు - ₹20 లక్షలు

గ్రామ పంచాయతీ భవనం నిర్మాణం - ₹20 లక్షలు

ప్రాథమిక పాఠశాల కిచెన్ షెడ్ నిర్మాణం - ₹3 లక్షలు

సింగిల్ ఫేజ్ విద్యుత్ లైన్ ఏర్పాటు - ₹20 లక్షలు

పానగల్ R&B రోడ్డు నుండి పుల్గర్ల (పయా దావాజ్‌పల్లి) వరకు రోడ్డు వెడల్పు చేయుటకు - ₹41.75 కోట్లు

గ్రంథాలయ భవనం నిర్మాణం - ₹10 లక్షలు

ఈ అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించిన జూపల్లి కృష్ణారావు గారికి గ్రంథాలయ చైర్మన్ గోవర్ధన్ సాగర్, సర్పంచ్ సుగుణమ్మ, మాజీ సర్పంచ్ జయరాములు సాగర్, మాజీ సర్పంచ్ కృష్ణయ్య సాగర్,ఉప సర్పంచ్ మరియు వార్డు మెంబర్ సభ్యులకు సహకరించి ముందుఅడుగులో ప్రయాణిస్తున అందరికి ప్రత్యేక ధన్యవాదాలు.

Printed, Published and Owned by B.KALPANA and Printed at Kalpana Publications , Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505, and Published at Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505. Editor: B.KALPANA. PRGI.No.TGTEL/25/A4195. Cell 9848288850, namasteshekar@gmail.com